

# యానాం పేటిగేట్టుమీద...

**వా**ళ్ళిద్దరూ లేచిపోయి నెలరోజులైంది. పట్టిసం అవతల పాతిక ఎకరాల పొగాకు తోట యజమాని బులిసుబ్బయ్య కూతురు సావిత్రి. వేగేశ్వరపురం పంపింగ్ షెడ్‌లో రోజువారీ కూలీకి చేరిన మనిషి సుందరం.

నిరుడు తాళ్ళపూడి జాతరకి వెళ్ళినప్పుడు పరిచయం అయ్యింది సావిత్రి. పదినెలల కాలంలో ఆ పరిచయం బలమైన బంధంగా మారింది. పెళ్ళి చేసుకుని అదే ఊళ్ళో కాపురం చేద్దామంటే పరిస్థితులు ఏమాత్రం అనుకూలించలేదు.

దాంతో ఒకరోజు రాత్రి, పాపికొండల దగ్గర్లో వున్న కొండమొదలు అనే ఊర్నుంచి బయలుదేరే పాసింజరు లాంచి వాళ్ళ ఊరి రేవులో ఆగినప్పుడు అది ఎక్కి రాజమండ్రి గోపాదాలరేవు దగ్గర దిగారు.

అక్కడ్నించి అన్నవరం వెళ్ళి పెళ్ళి తంతు ముగించుకుని రెండురోజులు సత్రంలో కాపురం చేసేసరికి తెచ్చుకున్న డబ్బులు మొత్తం అయిపోయాయి. ఇక వేరే దారిలేక దేవస్థానం సత్రంలో పనికి కుదిరారుగానీ నాలుగురోజులకంటే ఎక్కువ వుండలేక పోయారక్కడ.

ఆ తర్వాత కత్తిపూడి జంక్షన్‌కి, అక్కడ్నించి బంగాళాపెయుల బట్టీలుండే జగ్గంపేటకీ మారారు.

సావిత్రి అందగత్తె అయిన కారణంగా విషమించే పరిణామాలు ఎక్కువగా ఏర్పడ్డంతో ఒకరాత్రి లారీ ఎక్కి రావులపాలెం వెళ్ళారు. అమృతపాణి అరటిగెలలు టోకున అమ్మే కొండల్రావుదగ్గర పనికి కుదిరారు. అక్కడా సమస్యే.

వారం రోజులపాటు అంబాజీపేటా, అమలాపురం తిరిగి ఒకరోజు రాత్రయ్యేసరికి ఎదుర్లంక రేవుకొచ్చారు. ఆ ఒడ్డుకి అవతలివైపుంది యానాం. టిక్కెట్లు కొనుక్కుని ఫంట్ ఎక్కారు.

పౌర్ణమి వెళ్లిన మూడోరోజు అది.

చంద్రుడు ఆకాశంలోకి ఆలస్యంగా వచ్చాడు.

ఆగాగి వీస్తుంది తూరుపుగాలి.

గోదావరి మధ్యలో వేటపడవలవాళ్ల లాంతర్లు మినుకుమినుకుమంటూ వెలుగుతున్నాయి.

ఫంట్‌నిండా వున్న జనం తెగ మాటాడుకుంటున్నారు. ఒక మూల కూర్చున సావిత్రికి కాస్త ఆనుకుని కూర్చున్న సుందరం, "మనం ఎక్కడి కెళ్ళినా ఏదో ఒకటి జరిగి మనల్ని అక్కడ వుండనియ్యకుండా చేస్తుంది. ఎందుకంటావ్?" అన్నాడు.

వెన్నెల్లో గోదావరిని చూస్తున్న సావిత్రి తలెత్తలేదు. నోరు విప్పలేదు.

మళ్ళీ అడిగాడు.

"ఏమో!" అంది మంద్రంగా.

"నిజంగా నీకు తెలీదా, సావిత్రీ?"

"తెలీదు."

"నాకు తెలుసు... చెప్పనా!"

"ఏంటీ?"

"నీ కళ్ళు బాగుంటాయి. నువ్వు పొడుగ్గా, అందంగా వుంటావు. నాకు కొంచెం పొట్ట వుంది. పొట్టిగా వుంటాను. నా ముఖం పెద్దేం బాగోదు."

"ఏదో చెప్తానని ఇదంతా చెప్తున్నావేంటి?" ఇబ్బందిగా అడిగింది సావిత్రి.

"అక్కడికే వస్తున్నాను విను. పక్కపక్కనే నిలబెడితే మనిద్దరిదీ సరైన జంట కాదు. మనిద్దర్నీ చూసిన జనం మొగుడూ పెళ్లాలుగా లెక్కేసుకోలేక, నన్ను నీ భర్తగా అంచనా వెయ్యలేక లోకువ కడ్తున్నారు. ఆ కారణంగానే మన పెళ్లయిన రోజునించీ ఏదో ఒకటి జరుగుతూనే వస్తోంది".

ఇంకా ఏదో చెప్పబోతున్న సుందరాన్ని ఇక ఆపమని సైగచేసి "భార్యాభర్తలంటే ఈడూజోడూ సరిగ్గా వుండటంకాదు. నువ్వు పొడుగు లేకపోవచ్చు. నీముఖం బాగోకపోవచ్చు. ఏ అందగాడికీ లేనంత అందమైన మనసుంది నీకు. నాకు కావల్సింది అదే. అది నచ్చే నిన్ను కోరుకున్నాను. ఇక జనం మనల్ని ఎలా అనుకున్నా నా కనవసరం. నాకు నువ్వు, నీకు నేను. అంతే. ఇంకెప్పుడూ ఇలా ఆలోచించొద్దు" అనేసింది సావిత్రి.

వాళ్ళలా మాటాడుకుంటుండగా మధ్యలో కొచ్చాడు ఒక మనిషి. నల్లగా, సన్నగా, కాస్త పొడుగ్గా వున్నాడు. ఓపెన్ షర్టు, లూజు పైజామా వేసుకున్న అతను "ఎందాకా ప్రయాణం?" అనడిగాడు.

"యానాం ఊళ్ళోకి." చెప్పాడు సుందరం.

"ఎవరింటికీ?" మళ్ళీ అడిగాడా మనిషి

"ఎవరింటికీ కాదు. చాలాదూరంనించి వస్తున్నాం. అక్కడేమన్నా పని దొరుకు తుందేమోనని బయల్దేరాం" అంది సావిత్రి.

"మీ ఇద్దరూ ఏమవుతారు."

"భార్యాభర్తలం"

"ఏంటీ??"

"అవునండీ మేమిద్దరం మొగుడూ పెళ్ళాలం. ఏం?" అంది సావిత్రి.

"ఏంలేదు... మరి నీ భాషకీ ఇతని భాషకీ, తేడా వుందేంటీ?"

"తను బాగా చదూకుంది." చెప్పాడు సుందరం.

"అలాగా!" అని కాస్త ఆలోచించిన ఆ మనిషి "పారిపోయి వచ్చారా?" అన్నాడు.

"అవును... అన్నవరం వెళ్ళి పెళ్ళిచేసుకున్నాం." చెప్పింది సావిత్రి.

"ఏ పని చెయ్యగలరు?" అడిగాడా మనిషి

"ఏదైనా సరే...కష్టపడి చేస్తాం."

వాళ్ల మాటల్లో నిజాయితీ కనిపించిందా మనిషికి. "నా పేరు యర్రంశెట్టి నీలాద్రి. ఊళ్లో అంతా అబ్బాయి అని పిలుస్తుంటారు. వంతెనకి అటుపక్కన ఒక ఇటుకల బట్టి వుంది మాకు. వెయ్యి పచ్చి ఇటుకతీస్తే యాభై రూపాయిలిస్తాను. మీ ఇద్దరూ కలిస్తే సునాయాసంగా రోజుకి వెయ్యి తీసెయ్యగల్రు" అన్నాడు.

"ఇటుక ఎలా తియ్యాలో మాకు రాదే?" అన్నాడు సుందరం.

"అదెంత... పూటపని. రేపు నాతో పాటొస్తే మట్టిలో పాళ్ళు ఎలా కలపాలో, అచ్చులో మట్టిముద్ద నొక్కి నేలమీదెలా గుమ్మరించాలో నేర్పుతాను" అన్నాడు అబ్బాయి.

అలాగే అన్నారిద్దరూ.

"పదకొండు దాటేసింది- మీరు భోజనం చేసినట్టు లేదు."

"పర్లేదండీ."

"భళేవోరే" అన్నాడు అబ్బాయి.

ఇంకాస్సేపయింది.

రేవు దగ్గరపడేసరికి అంతసేపూ కబుర్లలో పడివున్న జనంలో కలకలం రేగింది. ఒడ్డుకి పూర్తిగా చేరకండానే నీళ్ళలోకి దూకేస్తున్నారు కొందరు. మరి కొందరు ఒడ్డుమీదికి జంప్ చేసేస్తున్నారు. ఫంట్ ఒడ్డు అంచు తాకాకా బల్లవేశాడు సరంగు. ఒకళ్లనొకళ్ళు తోసుకుంటూ ఒడ్డు ఎక్కుతున్నారు. అబ్బాయి వెనకాలే నడవడం మొదలెట్టారు. వెన్నెల్లో ముగ్గురి నీడలూ పొడుగ్గా సాగుతున్నాయి.

పెద్దదొరగారి ఆఫీసుమీదుగా వెంకన్న బాబు గుడి వీధి దాటి, పాత బస్టాండ్వైపు మలుపుతిరిగి వంతెనకేసి నడుస్తున్నారు.

వంతెనకి అటుపక్కగా వున్న గట్టువేపు మలుపు తిరుగుతుంటే తలుపులు వేసివున్న రేకుల షెడ్డు ఒకటి కనిపించింది. గట్టుకి ఆ చివర్నుంచి ఈ చివరి దాకా పెద్ద ఇనప గొలుసు ఒకటి అడ్డంగా కట్టివుంది.

"ఇదిగో గవర్రాజుగారూ! కొంచెం గొలుసు తీద్దురూ" అరిచాడు అబ్బాయి.

అలా రెండుమూడుసార్లు అరిచాకా మూసివున్న రేకుల షెడ్డు తలుపులు బద్ధకంగా తెరుచుకున్నాయి. కాకీ నిక్కరూ, ఖద్దరు బనియనూ వేసుకున్న ఒక నల్లటి లావుపాటి మనిషి ఆవులిస్తూ లాంతరు అందుకుని "ఏంటయ్యా గొలుసు తియ్యడానికి మాకు వేళాపాళా లేదా?" అన్నాడు.

"ఇటుక బేరం వుందంటే అనాతవరం వెళ్ళాను. ఇవేళ అవతల ఒడ్డున పంటి ఆలస్యంగా బయలు దేరింది." మెత్తగా చెప్పాడు అబ్బాయి.

విసుక్కుంటూ గొలుసు లాగాడు గవర్రాజు.

కొంచెం ముందుకెళ్లాకా "ఆ గొలుసేంటి? ఎవరతను?" అనడిగింది సావిత్రి.

"అది పి.డబ్ల్యు.డి. వాళ్ళ ఆఫీసు. వాడు మైలు కూలీ గవర్రాజు. ఈ గట్టుకి మహా రాజులే. మా ఇటుకలబళ్లు ఈ గట్టు దాటాలంటే ట్రిప్పుకి పదిరూపాయిలిస్తే తప్ప గొలుసు తియ్యడు." చెప్తూ ముందుకి నడుస్తున్నాడు.

గట్టుకి ఎడంపక్క గోదావరి కాలవ, కుడిపక్క నక్కలదిబ్బ. దానికి దూరంగా చిక్కగావున్న కొబ్బరి తోటలు, పంటపొలాలు.

గాలివేగం పెరిగింది. చంద్రుడు మబ్బుల్లో కెళ్తున్నాడు. అప్పుడప్పుడూ నక్కల అరుపులు తప్ప వాతావరణం అంతా నిశ్శబ్దంగా వుంది.

గట్టుమీద కొంతదూరం నడిచాకా కొత్తగా కట్టిన డాబా కనిపించేసరికి అక్కడాగిన అబ్బాయి- "ఇదే మా ఇల్లు. ఇంకొంచెం ముందుకెళ్తే మా బట్టీ వస్తుంది. దానిముందు ఆరిన పచ్చిఇటుక దాయడానికి నేసిన మా తాటాకుపాక వుంది. మీ ట్రయుపెట్టి అదీ అందులో పెట్టుకుని గోదాట్లో కాళ్ళూ చేతులు కడుక్కురండి. ఈలోగా మా వెంకటలక్ష్మిని లేపి వంటచేయిస్తాను" అన్నాడు.

★★★

ఆడుతూపాడుతూ రోజుకి పదిహేనువందల ఇటుక తీసేస్తున్నా రిద్దరూ. వెన్నెల రాత్రుళ్లలో అయితే రెండువేలకి పైనే తీస్తున్నారు.

తెల్లవారుఝాము రేవులో సరిగంగ స్నానాలు, కొబ్బరితోటల్లో సరసాలూ సల్లాపాలూ. ఇటుక రవాణా చేయడానికి వచ్చే పడవల్లో షికార్లు, కాలవకి అటుపక్క టూరింగ్ టాకీసులో సినిమాలు. మస్తాను మిలటరీ హొటల్లో పలావు పొట్లాలు, డబ్బులు ఇష్టానికి ఖర్చు పెట్టేస్తున్నారు.

ఆ రోజు ఆకాశంనిండా మబ్బులు. ఒకటే ఈదురు గాలులు. కుండపోతగా కురుస్తోంది వర్షం.

ఏటిగట్టంతా బందబందగా తయారవడంతో ఎడ్లబళ్ళు రావడం మానేశాయి. ఒక్క వర్షంగాలీ శబ్దం తప్ప ఎక్కడ చూసినా నిశ్శబ్దం.

మొన్న సంతలో కొన్న బర్మా రగ్గు కప్పుకుని వెచ్చగా మెలికలు తిరిగి పడుకున్నారు.

వెచ్చటి వెన్నెల్ని ఇక స్వేచ్ఛగా గిల్లుకోవచ్చనీ, కరిమబ్బులకి ఉయ్యాల వేసుకుని హాయిహాయిగా ఊగొచ్చనీ, తారల్నించి వెండిదారాలు తీయొచ్చనీ, నదిఅలల్లో చేరి అందమైన కలల్ని అల్లొచ్చనీ అప్పుడే తెలిసింది.

జీవితం పరమ సుఖమయం అని ఇప్పుడే అర్థమయ్యింది.

★★★

పాత మైలు కూలీగవ(రాజుకి దవిళేశ్వరం ట్రాన్స్ఫరైతే కోటిపల్లినుంచి రవ(ణరాజు అనే కొత్త మైలుకూలీ దిగాడు.

గవ(రాజులాగ ఏభై ఏళ్ల మనిషి కాదు రవ(ణరాజు. మహాఅయితే ముప్పై వుంటుంది. అందగాడు. ముక్కుపొడుం రంగు పాంటూ, చిన్న గళ్లచొక్కా వేసుకుని కొత్త హంబర్ సైకిలు తొక్కుకుంటూ ఏటిగట్టుమీద వెళ్తుంటే చొక్కాకి రాసుకున్న నూర్జహాన్ సెంటు ఆ గట్టంతా గుభాళిస్తుంది.

అతను సిగరెట్ కాలుస్తుంటే చాలా చక్కని వాసనొస్తుంది. అతని పక్కన కూర్చున్న వాళ్ళకి కూడా కాల్చాలి అనిపిస్తుంది.

అక్కడి గోదావరి కాలవలో స్నానం చేస్తున్నప్పుడూ, వెన్నెల్లో ఇటుక ఆవ( కాలుస్తున్నప్పుడూ సావి(త్రి రవ(ణరాజుకి కనిపించింది. అతని డేగ చూపులు జారిపోయిన బాల్చీకోసం నూతిలో వదిలే గేలం ముళ్ల లాగా గుచ్చుకోవడం మొదలెట్టాయి ఆమెకి.

ఆ రోజు మంగళవారం. యానాం సంత.

ఎండుచేపల దుకాణం దగ్గరున్న సావి(త్రి పక్కనే నిలబడ్డాడు. తనని గమనించికూడా పట్టించుకొని సావి(త్రి అక్కడ్నించి చింతచిగురు అమ్మే దుకాణం దగ్గరకెళ్ళింది.

ఆమెపక్కనే నడిచెళ్ళాడు.

వాళ్లిద్దర్నీ అలా పక్కపక్కనే చూసిన ఆ సంతలో జనం కొత్తగా పెళ్ళయినట్టుంది. చూడ్డాని కెంత ముచ్చటగా వున్నారూ అనుకోవడం ఇటు సావి(త్రీ, అటు రవ(ణ రాజూ విన్నారు.

రాత్రంతా సంతలో జనం అన్నమాటల గురించే ఆలోచించాడు రవణంరాజు. తన ప్రమేయం లేకుండానే సావిత్రి తనకు చాలా దగ్గరయినట్టూ, ఆ తర్వాత సొంతమయినట్టూ కలలొచ్చాయి.

అలా కొన్నాళ్ళు అలాంటి కలలనే అందంగా అనుభవించిన రవణంరాజుకి ఆమె లేకపోతే ఇక బతక లేని స్థితి ఏర్పడింది. చచ్చి అయినాసరే సాధించాలి అన్న నిర్ణయాని కొచ్చేశాడు.

ఇటుకబట్టి వ్యాపారం చేసే అబ్బాయికి ఊక పొయ్యిలు కట్టే పనికూడా వచ్చు.

ఆ ప్రాంతాల్లో కొత్తగా కాఫీ హొటళ్లు పెట్టుకోబోతున్న వాళ్లు పొయ్యి కట్టడానికి అబ్బాయినే ఎక్కువగా పిలుస్తుంటారు.

ఒక సాయంత్రం ఆ పనిమీద దరియాల తిప్పనించి కబురొస్తే బయలు దేరుతూ పై పని చెయ్యడానికి పనికొస్తాడని సుందరాన్ని కూడా తీసుకెళ్ళాడు.

ఒంటరిగా వున్న సావిత్రి దగ్గరకెళ్ళి ఆ మాటా ఈమాటా అయ్యాకా తన మనసులో మాట బయట పెట్టేసరికి కొమరిపాలెం పేలుడుజువ్వలా లేచింది సావిత్రి. ఇంకా ఏదో మాటాడబోతుంటే ఇక మాటాడే అవకాశం ఇవ్వలేదు. వెనక్కి తిరిగి వచ్చెయ్యడం తప్ప చేసేదేం లేకుండాపోయింది.

★★★

ఇంతకుముందు ఎప్పుడూ లేనంత విపరీతంగా వున్నాయి ఎండలు. మిట్ట మధ్యాహ్నం బయటికి రావడానికి చాలా భయపడి పోతున్నారు జనం.

వీచి కొడ్తోంది వడగాల్పు.

ఆ ఎండలో బట్టీ కాల్చడానికి పై కెక్కిన సుందరం దానిమీద గంటసేపు వుండి పోయేసరికి కొడ్తున్న వడగాల్పుకి కళ్లు తిరిగి నట్టయ్యి ఎత్తయిన ఆ బట్టి మీంచి కింద పడిపోయాడు.

స్పృహతప్పింది సుందరానికి.

ఊళ్ళోవున్న వర్మ డాక్టరుగారి దగ్గరికి తీసుకెళ్ళేసరికి కోమాలోకి వెళ్లిపోయాడు సుందరం.

తలలో చిన్న నల్ల కంకరాయి గుచ్చుకుంది. రాజమండ్రి స్వతంత్ర హాస్పిటల్‌నించి న్యూరోసర్జన్‌ని తీసుకు రావాలి అన్నాడు డాక్టరు.

అబ్బాయి దగ్గరికి పరుగెట్టుకెళ్ళిన సావిత్రి అతన్ని బతిమాలింది. కాయితంమీద సంతకం పెడితే పదివేల దాకా సర్దగలను అన్నాడతను.

మళ్ళీ డాక్టరుదగ్గరికి పరుగెట్టుకెళ్ళి ఎంత ఖర్చయినా పర్లేదు; మా సుందరం బతకాలి... నా భర్తని బతికించండి అని బోరున ఏడ్చింది.

రోజులు గడుస్తున్నాయి

సుందరం ఇంకా స్పృహలోకి రాలేదు.

★★★

కాదు పొమ్మంటోంది కానీ ఆ సావిత్రి నాకు సరైన జోడీ. ఈ ఏటిగట్టుమీదే కాదు; ఈ ఊరి మొత్తంమీద ఎవర్నడిగినా అదే చెప్తారు. నూరు ఆరైనా సరే సావిత్రితో ఒప్పించాలి.

ఎలాగ?

ఈ గట్టు గవర్నమెంటుది. ఇటుకతీత ఆపేసి బట్టీలు పడగొట్టెయ్యండి. వెంటనే నే చెప్పినట్టు చెయ్యకపోతే కోటిపల్లిలో వుండే మా పెద్ద దొరగారికి కంప్లయింట్ చెయ్యాల్సి వస్తది. ఆయనొచ్చాడంటే మీ బట్టీలు పడగొట్టడమే కాదు; జరమానాగా తలో లక్షా వేసేస్తాడు అంటూ అబ్బాయితోనూ, ఆ గట్టు మీదున్న తక్కిన బట్టీవాళ్ళతోనూ ఘర్షణ పడ్తున్నాడు రవణరాజు.

అందరికి తెల్సు అతను పెడ్తున్న గొడవ వెనకాల అంతరార్థం. ఎలాగూ లేచిపోయివచ్చిన బాపతేగా ఒకరాత్రి ఆడి దగ్గరైత్తే వచ్చిన నష్టమేంటి.

అసలు దాని మొగుడికంటే వాడెంత అందగాడనీ. నిజం చెప్పాలంటే సావిత్రికి సరైన జోడు సుందరం కాదు; ఆ రవణ రాజే. బయటపడ్డంలేదు గానీ ఎవరికి వాళ్ళ గొణుక్కుంటున్నారు.

సావిత్రికి ఖాయంగా అర్థమైపోయింది. రవణరాజుది డేగ చూపు. వాడి గురి మహారథులు, బ్రహ్మ రాక్షసులుకూడా తప్పించుకోలేని గురి.

ఆ సాయంత్రం మబ్బులు దట్టంగా మూసేసి వున్నాయి. పెద్ద వడగళ్ల వాన పడేలా వుంది. కళ్ళంలో ఆరబెట్టిన పచ్చి ఇటుకని పాకలోకి చేరవేస్తున్న టైములో కడుపులో తిప్పినట్టయ్యి పెద్దగా వాంతి చేసుకుంది.

ఏదో అనుమానమొచ్చి డాక్టరుదగ్గరకి పరుగెట్టింది. పరీక్షలు చేసిన నర్సు హాయిగా చెప్పేసింది నీకు మూడోనెల అని. ఒకప్పుడు ఆనందపడేదేమో! ఆ క్షణంలో మాత్రం గుండెలు సర్వం జారిపోయినట్టనిపించి గబగబా డాక్టరు దగ్గరకి పరుగెత్తి -

"నర్సమ్మ నాకు కడుపని చెప్పింది. భర్త లేని నేను రేపు పుట్టబోయే నా బిడ్డతో ఈ ఏటిఒడ్డున చాలా దుష్టశక్తుల్ని ఎదుర్కోవాలి. చెప్పండి... నా భర్త బతుకుతాడు అంటే ఈ కడుపు వుంచుకుంటాను. లేకపోతే తీయించేసుకుంటాను."

గొంతు పెంచి ఆవేశంగా మాటాడుతున్న ఆమె మాటలు ఏమాత్రం అర్థం గాని డాక్టరు వర్మ రాజమండ్రినించి వచ్చిన న్యూరో సర్జన్‌తో సుందరం గురించి చర్చించి, 'రేపు రా' అన్నాడు.

వారం తిరిగింది. కోమాలోంచి బయట పడ్డాడు సుందరం.

నీ భర్త ఖాయంగా బతుకుతాడు అన్నారు వర్మగారు.

రోజులు గడుస్తున్నాయి. సావిత్రి కడుపులో పిండం పెరుగుతోంది. గట్టుమీద రవణరాజా, తక్కిన బట్టీలవాళ్ళూ పెడ్తున్న గమ్మత్తయిన బెదిరింపుల్ని భరిస్తూనే పరమానందంగా తన భర్తకి సేవలు చేస్తోంది.

సుందరం ఇప్పుడు చక్కగా మాటాడుతున్నాడు. సరదాగా నడిచి తిరుగుతున్నాడు.

ఒక సాయంత్రం అతనితో చెప్పింది- 'ఇప్పుడు నాకు నాలుగో నెల నిండబోతోంది'. అని. చాలా సంబరపడ్డాడు సుందరం.

★★★

వెంకన్నబాబు గుడి ఎదురువీథిలో వున్న హాస్పిటల్లోంచి డిశ్చార్జయిన సుందరం, సావిత్రి తీసుకొచ్చిన రిక్షాలో కూర్చున్నాడు. చిన్నా సెంటరూ, పాత బస్టాండ్ దాటి వంతెన పై వెళ్తోంది రిక్షా.

ఎప్పుడూ లేనంత ఆనందంగా వున్నాడు సుందరం. ఏదో చెప్పి అది పూర్తి చెయ్యకుండానే నవ్వేస్తున్నాడు. ఆ నవ్వు మధ్యలో ఆపేసి, ఇంకోటి చెప్పి మళ్లీ నవ్వేస్తున్నాడు. అతని నవ్వులకి రిక్షా ఊగుతోంది.

వాళ్ళెక్కిన రిక్షా వంతెన దాటి ఏటిగట్టు మొదట్లో వుండే పి.డబ్ల్యు.డి. వాళ్ళ రేకుల షెడ్డువైపు మలుపు తిరుగుతుంటే గట్టుమీద పేపరుతో నిలబడ్డ తెలుగు దేశం సత్తిబాబూ, కాఫీ హొటలు పోసయ్యా, సూర్యనారాయణా రిక్షాలో వున్న సుందరం కేసి చూస్తున్నారు.

సాయంత్రం ఆ ఏటి గట్టుమీదుండే డ్రైవరు సుబ్బారావు సత్తెమ్మకి కల్లు పోస్తూ శేషారావుతో ఓ ముంత పంపించాడు. బాగా పొద్దుపోయాకా స్నానంచేసి హుషారుగా ఆ ముంత అందుకుని గటగటా తాగేశాడు సుందరం.

చాలా ఆనందంగా వున్న సుందరాన్ని చూస్తూ వంతెన దగ్గర కెళ్ళొస్తాను అంది సావిత్రి. ఎందుకన్నాడు. 'నీకు దిష్టితియ్యడానికి ఎండుమిరప కాయలూ, ఇవాళ కూర వండటానికి మేకమాంసం తీసుకొస్తాను' అంది.

'పొద్దుపోయింది ఒంటరిగా ఏం వెళ్తావ్, అందులోకి అయిదునెలలు నిండాయి నేనూ వస్తానుండు' అని ఆమెవెనక బయలుదేరాడు. రేకులషెడ్డు దాటి రోడ్డుమీది కొచ్చారో' లేదో. చొల్లంగివైపు నుంచొస్తున్న ఎండుచేపల లారీ ఇద్దర్నీ గుద్దేసేసరికి చెరోమూలా పడ్డారు.

సావిత్రికి మోచేతులు కొట్టుకుపోయాయితప్ప పెద్దగా దెబ్బలేం తగల్లేదు. గబుక్కున లేచి ఇంకోమూల పడున్న సుందరం దగ్గరకి పరుగెత్తింది. ఇంతకు ముందు ఏ తలమీదయితే దెబ్బ తగిలిందో సరిగ్గా అక్కడే చిన్నదెబ్బ తగలడంతో అతని ప్రాణం పోయింది.

చనిపోయిన సుందరంకేసి అవాక్కయి చూస్తోంది సావిత్రి. అప్పుడే రేకుల షెడ్డులోంచి బయటికొచ్చిన రవణరాజు డేగకళ్ళతో ఆమెనే రెప్పార్పకుండా చూస్తున్నాడు.

('స్వాతి సపరివారపత్రిక 3-7-1998)✳